

# తొలిరోజుల్లో తారలు

సినిమారంగంలో తారాపథంలో వెలిగిన(వెలుగుతున్న) నటీనటులందరూ ఏదో ఒకనాడు చిత్రసీమకి కొత్తవారే! సినిమారంగంలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నాక వాళ్ళ గురించి వార్తలు విశేషాలు అసంఖ్యాకంగా వస్తుంటాయి. ఐతే, సినీరంగ ప్రవేశానికి వాళ్ళు ప్రయత్నాలు చేస్తున్నప్పుడో, లేదా ప్రవేశించిన కొత్తలోనో వాళ్ళ గురించిన వార్తలు ఎలా ఉండేవి, వాళ్ళ చిత్రాలు ఎలా ఉండేవి.. అనే ఆసక్తికరమైన సమాచారాన్ని ఈ శీర్షికలో కౌముది పాఠకులకోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. ఈ విశేషాలన్నీ 40, 50 సంవత్సరాల క్రిందటి పత్రికలలో వచ్చినవి.




నిర్మల
విజయనిర్మల
నీరజ

# పరిచయం

## కొత్తగాయకుడు బాలసుబ్రహ్మణ్యం



"శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చిత్రంలో ఒక కొత్త అబ్బాయి పాడాడు. మంచి గొంతు, అద్భుతంగా వుంది" అని ఆ పాట విన్న ఒకాయన, రెండో ఆయనతో చెప్పారు. చిత్రం చూసిన రెండో ఆయన "నిజమే" ననుకున్నారు. ఆ అబ్బాయి పేరు బాలసుబ్రహ్మణ్యం. చిత్రాల్లో పాడడం అదే మొదటిసారి.

బాలసుబ్రమణ్యం పాట విని, అతన్ని చూసిన వాళ్ళు అతనే ఆ పాట పాడాడంటే నమ్మరు. ఎందుకంటే ఘనమైన కూత కూసిన పిట్ట, ఇంత కొంచెం వుండడం ఏమిటని అనుకుంటారు.

ఆ అబ్బాయి ఇంకా అబ్బాయే. ఇరవైరెండేళ్ళ వాడు; ఏ. యమ్. ఐ. ఇ. చదువుతున్నాడు.

బాలసుబ్రమణ్యం తండ్రిగారు హరికథలు చెబుతారు. ఆయన పేరు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి. ఆ వాసన బాలసుబ్రమణ్యంలో చిన్నప్పుడే ప్రవేశించింది. తండ్రిగారి పాటలు, సినిమా పాటలూ పాడడం సాగించాడు. పాటలు పాడడంలో మంచి ఉత్సాహం చూపాడు. అయితే సంగీతం నేర్చుకోలేదు. చదువుకోవడంతోనే సరిపోయింది.

1963 లో మద్రాసులో సోషల్ అండ్ కల్చరల్ క్లబ్‌వారు నాటకపోటీలు, సంగీతంలో పోటీలూ జరిపారు. ఉత్సాహం గల బాలసుబ్రమణ్యం నెల్లూరు నుంచి వచ్చి ఆ పోటీల్లో పాల్గొన్నాడు. తేలికపాటల పోటీలలో బాలసుబ్రమణ్యానికి మొదటి బహుమతి వచ్చింది. ఆ పోటీకి న్యాయనిర్ణేతలు—పెండ్యాల, ఘంటసాల, సుసర్ల.

ప్రేక్షకుల్లో కూచుని, బాలసుబ్రమణ్యం పాట విన్న సంగీత దర్శకుడు కోదండపాణికి అతని గొంతు బాగా నచ్చింది. "నీ పాట పాడే పద్ధతి నాకు బాగా నచ్చింది. నీ చేత నేను చిత్రాల్లో పాడిస్తాను. ఐతే ఇప్పుడు నీ గొంతు మరీ లేతగా వుంది" అని చెప్పి, అతన్ని అభినందించారు. కోదండపాణికి అతని గొంతు ఎంత బాగా నచ్చిందో, కోదండపాణి అభినందన బాలసుబ్రమణ్యానికి అంతకంటె బాగా నచ్చింది; తన 'లేత గొంతు' ఎప్పుడు కాస్త 'ముదిరితే' అప్పుడు వెళ్ళి కోదండపాణిని చూడాలని అనుకున్నాడు. అక్కడినుంచీ తన గాత్రంమీద శ్రద్ధ తీసుకున్నాడు; వీలున్నప్పుడు కోదండపాణిని చూడడం కూడా సాగించాడు.

బాలసుబ్రమణ్యం సొంత వూరు నెల్లూరే అయినా, అతను మద్రాసులో ఏ. యమ్. ఐ. ఇ. చదవడంవల్ల కోదండపాణిగారిని అప్పుడప్పుడు చూడడానికి అవకాశం కలిగింది.

'మర్యాదరామన్న' చిత్రంప్రారంభానికి ముందు కోదండపాణి, బాలసుబ్రమణ్యానికి కబురు చేసి, పద్మనాభానికి అతని పాట వినిపించారు. పద్మనాభానికి అతని గొంతు బాగా నచ్చింది. కొత్తవారిని ప్రోత్సహించాలన్న గట్టి నమ్మకం గల పద్మనాభం వారం తర్వాత బాలసుబ్రమణ్యాన్ని పిలిపించి—పాట ఇచ్చారు. ఆ పాటే—'మర్యాదరామన్న'లో అతను శోభన్‌బాబుకు పాడిన "ఏమి ఈ వింత మోహం" అన్నపాట. బాలసుబ్రమణ్యానికి ప్రారంభంలో మరో మంచి అవకాశం కూడా కలిగింది — సుశీల, శ్రీనివాస్, రఘురామయ్యల పరిచయం కలగడం, వారితో కలిసి పాడడం. తర్వాత దర్బార్‌లో పద్మనాభం ముసలి పాత్రలో చదివిన "విశ్వమునకంటెను విపులమైనది ఏది?" అన్న పద్యాన్ని కూడా బాలసుబ్రమణ్యం పాడాడు. అతని పాటను మెచ్చుకున్నవాళ్ళు, పద్యాన్నీ మెచ్చుకున్నారు.



బాలసుబ్రమణ్యం సంగీతం నేర్చుకోలేదు. ఇప్పుడు నేర్చుకుంటున్నాడు. హిందూస్తానీ, కర్ణాటక సంగీతాలను శాస్త్రీయంగా నేర్చుకోవాలని కృషి చేస్తున్నాడు.

కోదండపాణి సంగీత దర్శకత్వంలో నిర్మింపబడుతున్న 'మూగజీవులు' చిత్రంలో కూడా బాలసుబ్రమణ్యం పద్యం, శ్లోకాలూ చదివాడు. కోదండపాణే, అతన్ని మహదేవన్‌కు పరిచయం చేశారు. మహదేవన్ అతనికి 'ప్రైవేట్ మాస్టారు' చిత్రంలో అవకాశం ఇచ్చారు. అందులో రామ్ మోహన్‌కు 'సోలో' పాడాడు బాలసుబ్రమణ్యం. ఒక కన్నడ చిత్రంలో కూడా అతనికి అవకాశం కలిగింది.

చదువుకుంటున్న రోజుల్లోనే బాలసుబ్రమణ్యానికి పాటల పోటీలలో బహుమతులు వచ్చాయి. 65—66 సం॥ లో ఆలిండియా రేడియోవారు జరిపిన తేలిక పాటల పోటీలలో కూడా అతను బహుమతి పొందాడు. చాలా సభలలోనూ సమావేశాలలోనూ అతను పాటలు పాడాడు.

సంగీతం ఒకరి దగ్గర నేర్చుకోకపోయినా రాగతాళాల జ్ఞానం, సంగీత జ్ఞానం పుష్కలంగా వుండడం వల్ల—బాలసుబ్రమణ్యం ఏమాత్రం ఇబ్బందీ, కష్టమూ పడకుండా అవలీలగా ట్యూన్‌ను పట్టగలిగి, పాడగలిగాడు. అతనిచేత పాడించిన సంగీతదర్శకు లిద్దరూ అతను తప్పకుండా పైకి రాగలడనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

"నాకు మొదటి అవకాశాన్ని కలగజేసిన కోదండపాణిగారికీ, పద్మనాభంగారికీ నేను కృతజ్ఞతలు చెప్పుకోవడం కంటె, వేరే చెప్పుకోడానికి నాకేం లేదు" అన్నాడు 'బాల'సుబ్రహ్మణ్యం.